

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 27.0

## తొలి వరుసలో ఏలూరు, ఉంగుటూరు ఫలితాలు

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ముందుగా వేసుకున్న లక్ష్యాల మేరకు తొలుత ఏలూరు సమాంతరంగా ఉంగుటూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఒక కొలిక్కి తెచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఉన్న ఓట్ల సంఖ్యను బట్టి కుదిరితే ఒంటిగంటలోపే ఫలితాలను తేల్చేందుకు సిద్ధపడుతున్నారు. ఈలోపే అన్ని నియోజకవర్గాల్లోనూ తొలిరౌండ్ అనుకున్నంత మేర ఒకే సమయంలో పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంగళవారం ఉదయం 9..9.30 మధ్య ఒకటి, లేదా రౌండ్లు పూర్తవుతాయి అని అంచనా వేస్తున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ స్థానాల ఫలితాలపై ఒక అంచనాకు వచ్చేందుకు అవకాశం కుదరబోతోంది.

# ఉత్కంఠ



## రేపే ఓట్ల లెక్కింపు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సమయం ఆసన్నమైంది మరికొద్ది గంటల్లోనే జిల్లా కేంద్రమైన ఏలూరులో పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల మేర రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఇంతకు ముందే ఈ ప్రాంతాన్ని నోఫ్లైజోన్‌గా నిర్ధారించారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది మంగళవారం ఉదయం ఆరు గంటలకు, కౌంటింగ్ ఏజెంట్లు ఏడు గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ప్రజాతీర్పు వెలువడనుండడంతో పోటీచేసిన అభ్యర్థులంతా క్షణక్షణం ఉత్కంఠతో ఉన్నారు.

ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి :

**నియోజక వర్గాల వారీగా రౌండ్లు**

- పార్లమెంట్ - 21
- ఏలూరు - 16
- ఉంగుటూరు - 16
- దెందులూరు - 18
- పోలవరం - 21
- చింతలపూడి - 20
- కైకలూరు - 17
- నూజివీడు - 21

- కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బంది అంతా ఆరు గంటలకే
- ఏడు గంటలకల్లా కౌంటింగ్ ఏజెంట్లు చేరుకోవాల్సిందే
- పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల కమిషన్ పాస్‌లుండాలి
- కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు రెడ్‌జోన్‌గా ప్రకటన
- మధ్యాహ్నం ఒంటి గంటలోపే తొలి ఫలితం



### నియోజకవర్గాల వారీగా ఓటర్లు.. పోలింగ్ శాతం

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | | | | పోలైన ఓట్లు | | | | శాతం |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం | |
| ఉంగుటూరు | 1,01,545 | 1,04,886 | 6 | 2,06,437 | 90,476 | 90,671 | 5 | 1,81,152 | 87.75 |
| దెందులూరు | 1,08,915 | 1,15,089 | 9 | 2,24,013 | 95,360 | 97,538 | 3 | 1,92,901 | 86.13 |
| ఏలూరు | 1,12,426 | 1,22,872 | 47 | 2,35,345 | 79,724 | 85,393 | 15 | 1,65,132 | 70.17 |
| పోలవరం | 1,22,760 | 1,31,212 | 9 | 2,53,981 | 1,06,151 | 1,12,142 | 4 | 2,18,297 | 85.95 |
| చింతలపూడి | 1,34,295 | 1,38,733 | 41 | 2,73,069 | 1,10,860 | 1,12,050 | 22 | 2,22,932 | 81.64 |
| నూజివీడు | 1,18,104 | 1,20,867 | 10 | 2,38,981 | 1,05,054 | 1,05,105 | 2 | 2,10,161 | 87.94 |
| కైకలూరు | 1,01,196 | 1,04,404 | 4 | 2,05,604 | 89,324 | 90,151 | 1 | 1,79,536 | 87.32 |
| మొత్తం | 7,99,241 | 8,38,063 | 126 | 16,37,430 | 6,77,009 | 6,93,050 | 52 | 13,70,111 | 83.68 |


### కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు, ఏలూరు పార్లమెంట్ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం ఆరంభం కానుంది. మరికొద్ది గంటల్లోనే ఈ ప్రక్రియకు వీలుగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ కేంద్రాల సమీపాన నిషేధాజ్ఞలు విధించారు. ఒకవైపు కౌంటింగ్ సాగుతుండగానే మరోవైపు కౌంటింగ్ వెలుపల ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బలగాలను మోహరిస్తున్నారు. ప్రత్యేకించి దెందులూరు, ఉంగుటూరు, ఏలూరు, పోలవరం, కైకలూరు, నూజివీడు, చింతలపూడి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏలూరు నగరంలో ఉన్న సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు.

ర్యాండమైజేషన్‌కు వీలుగా ఆదివారం సాయంత్రమే జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేశ్ కేంద్ర ఎన్నికల పరిశీలకులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం ఏడు గంటల్లోపు కౌంటింగ్ ఏజెంట్లు నేరుగా గుర్తింపు కార్డులతో సహా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని గుర్తింపుకార్డులు లేని వ్యక్తులు ఎవరిని కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించేది లేదని, ఎన్నికల అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నియమావళికి అనుగుణంగానే అభ్యర్థులు కాని, కౌంటింగ్ ఏజెంట్లు కాని నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే ఉండాల్సి ఉందని, దీనికి మించి ఏ పరిస్థితుల్లోనూ కదలికలను అనుమతించమని ప్రకటించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అటు సిబ్బంది కాని, ఇటు ఏజెంట్లు కాని ఎవరూ సెల్‌ఫోన్‌లు కాని, ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండరాదని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని మరో హెచ్చరిక జారీ చేశారు. ఒకవైపు కౌంటింగ్ ఆరంభం నుంచే ఎన్నికల కమిషన్ పరిశీలకులు కౌంటింగ్ ఏర్పాట్లను గడిచిన వారం రోజులుగా పర్యవేక్షించి ఏ నియోజకవర్గంలో టేబుల్స్ ఎన్ని ఏర్పాటు చేయాలి? అసెంబ్లీ, పార్లమెంట్‌కు, పోస్టల్ ఓట్లకు విడివిడిగా టేబుల్స్ ఎన్ని ఏర్పాటు చేస్తుంది ? గమనించి ఆ మేరకు తుది ఏర్పాట్లు పూర్తి చేశారు. సమాంతరంగా అసెంబ్లీ స్థానాలతో పాటు ఎంపీ స్థానాలు కూడా ఓట్ల లెక్కింపు జరిగేలా ప్రతి నియోజకవర్గాన్ని పరిగణలోకి తీసుకుని 16నుంచి 21 రౌండ్లు ఓట్ల లెక్కింపు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

### ఓట్ల లెక్కింపుపై సునిశిత పరిశీలన..

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది నిర్దేశించిన సమయంలోపే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకుని రిపోర్టు చేయాల్సి ఉంది. ఏ పరిస్థితుల్లోనూ సిబ్బంది హాజరుశాతాన్ని సహించమని ఆ మేరకు ఎక్కడికక్కడ రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఇప్పటికే సూచనలు జారీ చేశారు. కౌంటింగ్ ఏజెంట్లు ఏదైనా అనుమానం వస్తే తక్షణం నిలదీయాల్సిందేనని వైసీపీవర్గాలు ఇప్పటికే తమ పార్టీ ఏజెంట్లకు కీలక ఆదేశాలు ఇచ్చిన దరిమిలా కౌంటింగ్ ఏజెంట్లు అందర్ని క్షుణంగా తనిఖీచేసిన అనంతరమే కౌంటింగ్ హాల్లోకి అనుమతి ఇస్తారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం సృష్టించేందుకు దురుసుగా ప్రవర్తించిన అలాంటి వారందర్ని కౌంటింగ్ కేంద్రాల వెలుపలికి తరలించేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల భవనం ప్రాంగణంలో ఒక్కోహాల్లో ఏర్పాట్లు చేశారు. అదే హాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఓట్ల లెక్కింపుతో పాటు విడిగా మూడు టేబుల్స్ ఏర్పాటుచేసి, పోస్టల్ ఓట్ల లెక్కింపు కొనసాగేలా చూస్తారు. మంగళవారం ఉదయం ఏడు గంటల్లోపు సర్వీస్ ఓట్లు నిర్దేశించిన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఈ పోస్టల్ బ్యాలెట్లు హోమ్ ఓటింగ్, సర్వీస్ ఓటర్లు అంతా కలిపి ఒక్క ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోనే 17,500కు పైగా ఉన్నట్లు తాజాగా నిగ్గుతేల్చారు. ఇంతకుముందు పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు పూర్తి అయ్యేంత వరకు మిగతా ఓట్ల లెక్కింపు ఆరంభించేవారే కాదు. కాని ఈసారి దాన్ని మార్చి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం లెక్కింపు దాదాపు ఒకేసారి ప్రారంభం అవుతుంది. దీంతో ఫలితాలను అనుకున్నంత సమయంలోనే దాదాపు ఐదు గంటల వ్యవధిలోనే కొలిక్కి వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు.



### దేవుడా.. దేవుడా ..

పోలింగ్‌లో భారీ ఎత్తున ఓట్లు నమోదయ్యాయి. ఎవరంతటి వారుగా ఆయాపార్టీల అభ్యర్థులంతా ఓటర్లు తమకే పట్టం కట్టబోతున్నారంటూ ఓ అంచనాకు వచ్చేశారు. కాని ఓటర్లు గుమ్మనంగా వ్యవహరించడం, చివరి రెండు గంటల్లోనూ అనూహ్యంగా పోలింగ్‌శాతం పెరగడం పార్టీ అభ్యర్థులను తికమకపెడుతోంది. ఈ లోపే స్థానిక నేతల అంచనాలు తమకు అనుకూలంగా ఉన్నా.. వ్యతిరేకంగా ఉన్నా.. ఈలోపే ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా కూటమిదేపై చేయి అంటూ ఆ సర్వే ఫలితాలు. కాని మరికొన్ని సర్వేసంస్థలు అధికార వైసీపీకే తిరిగి పగ్గాలు ఖాయమంటూ విశ్లేషణలు వీటన్నింటి నడుమ మంగళవారం జరగబోయే ఓట్ల లెక్కింపులో తుది ప్రజాతీర్పు వెలువడనుంది. ఏలూరు లోక్‌సభస్థానం పరిధిలో పోటీచేసిన అభ్యర్థులంతా తీవ్ర ఉత్కంఠలో ఉన్నారు. ఆదివారం అంతా ఎవరంతటివారిగా తుది అంచనాలకు వచ్చేందుకు వీలుగా తమ సన్నిహితులతో మరోసారి భేటీ అయ్యారు. కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. ఎక్కడా ఏ లోటు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కౌంటింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లరాదంటూ నిర్దేశం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు లభించే ఓట్లను క్షుణంగా పరిశీలించాలని, పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరిస్తే నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా ? లేదా? అనే దానిపై నిర్ధారించుకోవాలని అభ్యర్థులంతా తమ ఏజెంట్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం : కలెక్టర్

ఏలూరుసిటీ, జూన్ 2 : జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంసిద్ధంగా ఉన్నామని, పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ వై. ప్రసన్నవెంకటేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై ఆదివారం జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా సెక్రటరియేట్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, డీఆర్‌వో డి. పుష్పమణి, రిటర్నింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లను సీఈవోకు కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాల్స్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి కౌంటింగ్ హాలులో 28 టేబుల్స్ ఏర్పాటు చేశామని, వాటిలో 14 టేబుల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి, 14 టేబుల్స్ పార్లమెంట్ నియోజకవర్గానికి కేటాయించి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోలైన ఓట్ల సంఖ్యను అనుసరించి 16 నుంచి 21 రౌండ్ల వరకు కౌంటింగ్ జరుగుతుం దన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, ఆర్‌వోలు ఎన్ఎస్‌కే ఖాజావలి, కె.అద్దయ్య, ఎం.ముక్కంటి, భాస్కర్, వై.భవానీశంకరి, డిప్యూటీ కలెక్టర్ బాబ్జి, కలెక్టరేట్ ఏవో కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది మంగళవారం ఉదయం ఆరు గంటలకు కౌంటింగ్ సెంటర్‌కు వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం తదితర ప్రాంతాల నుంచి విధులకు హాజరయ్యే సిబ్బంది ఉదయం ఆరుగంటల సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవటానికి వీలుకాదని, అటువంటి వారిని గుర్తించి, వారితో ఫోన్ ద్వారా సంప్రదించి వారిని ముందురోజే ఏలూరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని ఆర్‌వోలను ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ తదితరులు

### కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ పూర్తి

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేటాయిస్తూ రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో పరిశీలకులు నియోజకవర్గాల వారీ నియామకానికి సంబంధించి రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆదివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఏరామన్ , డాక్టర్ వి.అలీన్ సునీజా సమక్షంలో ఆయన నిర్వహించారు. ఏలూరు జిల్లాలో ఏలూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియకు 259 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 318 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 292 మంది మైక్రో పరిశీలకులు మొత్తంగా 869 మంది కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్‌లో పూర్తి చేశామన్నారు. వీరందరికీ తిరిగి ఓట్ల లెక్కింపు రోజైన ఈనెల 4వతేదీన ఉదయం మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఎవరు ఏ టేబుల్‌కు వెళతారో ఆయా టేబుళ్ళకు కేటాయింపు జరుగుతుందన్నారు.

## కౌంటింగ్‌కు మూడంచెల భద్రత

- వాహనాల రాకపోకలు.. దారి మళ్లింపు
- జిల్లా వ్యాప్తంగా పోలీస్ పికెట్లు
- అదనపు కేంద్ర బలగాల మోహరింపు

ఏలూరు క్రైం, జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మరో 24 గంటల్లో లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పర్యవేక్షణలో ఇప్పటికే ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఆ కాలేజీలోనే ఏలూరు ఎంపీ, ఎమ్మెల్యే నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల ఈవీఎం బాక్స్‌లు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆ ప్రాంతాల్లో ఉన్నతాధికారులు పరిశీలించి ఎక్కడా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ కవాతులు, మాబ్ ఆపరేషన్లు నిర్వహించారు. ట్రబుల్ మంగర్స్‌ను గుర్తించి బైండోవర్ చేశారు. రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో 134 ప్రధాన ప్రాంతాల్లో పికెట్లను ఏర్పాటు చేస్తున్నారు. 8 మంది డీఎస్పీలు, 24 సీఐలు, 70 మంది ఎస్ఐలు, 12 మంది పోలీసులను, 40 స్పెషల్ పార్టీ పోలీస్ బృందాలు, మరో 14 ర్యాపిక్ యాక్షన్ బృందాలు, రెండు కేంద్ర బలగాలను బందోబస్తులో వినియోగిస్తున్నారు.



### ట్రాఫిక్ మళ్లింపు

ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూముల వద్ద కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి నుంచి ఏలూరు మినీబైపాస్ రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. ఏలూరు పాతబస్టాండ్ నుంచి మినీ బైపాస్‌లో వట్లూరు వెళ్లే వాహనాలను ఏలూరు జూట్‌మిల్లు వద్ద నిలిపివేసి జూట్‌మిల్లు ఫ్లైఓవర్ మీదుగా ఫైర్‌స్టేషన్, కోర్టు సెంటర్, అమీనాపేట, శనివారపుపేట లోబ్రిడ్జి, సెయింట్ ఆన్స్ కాలేజీ మీదుగా శనివారపుపే దుగ్గిరాల వరకూ వెళ్లి బైపాస్‌లో విజయవాడకు వెళ్లాల్సి ఉంటుంది. అదేవిధంగా విజయవాడ నుంచి ఏలూరు మినీబైపాస్, ఏలూరు నగరంలోకి వచ్చే వాహనాలను కలపర్రు టోల్‌గేటు సమీపంలో ఏలూరు సర్వీసు రోడ్డు వద్ద వాహనాలను ఏలూరు నగరంలోకి రానీయకుండా దారి మళ్ళిస్తారు. బైపాస్ మీదుగా వాహనాలు దుగ్గిరాల వరకు వచ్చి దుగ్గిరాల సర్వీసు రోడ్డులో నుంచి ఏలూరు నగరంలోకి దుగ్గిరాల, శనివారపుపేట, సెయింట్ ఆన్స్ శనివారపుపేట లోబ్రిడ్జి, అమీనాపేట, కోర్టు సెంటర్, ఫైర్‌స్టేషన్ మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. శాంతినగర్ నుంచి వట్లూరు వైపు వెళ్లే వాహనాలను శాంతినగర్ జంక్షన్ వద్ద నిలిపివేసి గ్రేవియర్ నగర్ మీదుగా సెయింట్ ఆన్స్ కాలేజీ, శనివారపుపేట, దుగ్గిరాల మీదుగా జాతీయ రహదారిలోకి వెళ్లాల్సి ఉంటుంది. కాలేజీ పరిసర ప్రాంతాల్లోని వ్యాపార సంస్థలన్నీ పూర్తిగా మూసివేయనున్నారు. ఆ ప్రాంతమంతా సోమవారం మధ్యాహ్నం నుంచే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు.




## సహకార సంఘాల ఉద్యోగులకు ఊరట

- కోర్టును ఆశ్రయించిన ఉద్యోగులు
- ఉద్యోగ విరమణ వయస్సు పెంపు

ముదినేపల్లి, జూన్ 2 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులకు ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62కు పెంచాలని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు సహకార సంఘాల ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు వారికి అనుకూలంగా ఇటీవల తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఉద్యోగులకు రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచగా, ఆ ప్రయోజనం సహకార సంఘాల ఉద్యోగులకు వర్తింపచేయలేదు. దీంతో ఉద్యోగ విరమణ వయస్సు దగ్గర పడిన పలు సహకార సంఘాల ఉద్యోగులు తమకు కూడా రిటైర్‌మెంట్ వయస్సు పెంపును అమలు చేయాలని అప్పట్లో హైకోర్టు సింగిల్ బెంచ్‌లో అప్పీలు చేయగా, తీర్పు ఆ ఉద్యోగులకు అనుకూలంగా రాలేదు. వారు తిరిగి డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగానే సహకార సంఘాల ఉద్యోగులకు కూడ 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయస్సును వర్తింపజేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పునిచ్చింది. 60 ఏళ్ల రిటైర్‌మెంట్ వయ స్సుకు ముందు హైకోర్టులో అప్పీల్ చేసిన సహకార సంఘాల ఉద్యోగులు తీర్పు రాక ముందే రిటైర్ అయితే వారికి జీతాల బకాయిలు కూడ చెల్లించాలని కోర్టు ఆదేశం చింది. కోర్టును ఆశ్రయించి తీర్పు వచ్చే నాటికి 62 సంవత్స రాల వయస్సు లోపు ఉన్న ఉద్యోగులను ఆయా సహకార సంఘాల పాలక వర్గాల తీర్మానం ప్రకారం తిరిగి చేర్చుకుని పాత జీతాల బకాయిలను కూడ చెల్లించాలని కోర్టు స్పష్టం చేసింది.

## రైతులకు గుండు సున్నా

- మూడేళ్లుగా తన వాటా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- అమలుకాని సున్నా వడ్డీ పథకం
- పంట రుణాల రెన్యువల్‌కు రైతుల ఇబ్బందులు



ఏలూరు రూరల్, జూన్ 2: వైసీపీ పాలనలో తమకు ప్రయోజనం సున్నా అని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు బ్యాంకుల్లో తీసుకునే పంట రుణాలకు వడ్డీ తామే చెల్లిస్తామని ప్రభుత్వపెద్దలు ఆర్భాటంగా ప్రకటించారు. ఇది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. రెండేళ్ళుగా అన్నదాతలు రుణాల రెన్యువల్ సమయంలో వడ్డీ చెల్లించటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వడ్డీ రాయితీ బ్యాంకులకు జమ చేస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. గతంలో బ్యాంకులకు తొమ్మిది శాతం వడ్డీతో పంట రుణాలను మంజూరు చేసేవారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా బ్యాంకర్లతో చర్చించి ఏడుశాతం వడ్డీకే పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. దీనికి బ్యాంకులు అంగీకరించాయి. ఏడుశాతం వడ్డీలో మూడుశాతం కేంద్రప్రభుత్వం భరిస్తే మిగిలిన నాలుగు శాతం రాష్ట్రప్రభుత్వం భరించాల్సి ఉంది. సకాలంలో పంట రుణాలు రెన్యువల్ చేసుకున్న రైతులకు ఈ పథకం వర్తించేలా చర్యలు చేపట్టారు. రూ. లక్షలోపు రుణం ఉన్న రైతులు అందరికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రెండేళ్ళుగా కేంద్రప్రభుత్వం తన వాటా మూడు శాతం వడ్డీ రాయితీని బ్యాంకులో తీసుకున్న రుణాలకు జమ చేస్తోంది. కాని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ళుగా తాము చెల్లించాల్సిన నాలుగుశాతం వాటాకు మంగళం పాడింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్యాంకులకు వడ్డీ రాయితీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### రెండేళ్లుగా వడ్డీ రాయితీ లేదు

గత రెండేళ్ళుగా బ్యాంకుల్లో వడ్డీలు చెల్లించి, పంట రుణాలు రెన్యువల్ చేసుకుంటున్నాం. ప్రభుత్వం సున్నావడ్డీకే పంట రుణాలు ఇస్తున్నట్లు ప్రకటించినా బ్యాంకులో అవి అమలు కావడం లేదు. దీంతో ప్రతి ఏటా వడ్డీ చెల్లిస్తున్నాం. ఈ ఏడాది పంట రుణాల రెన్యువల్ ఒకేసారి రావడంతో విత్తనాల కోసం ఉంచుకున్న డబ్బులతో పంట రుణాలు రెన్యువల్ చేస్తున్నాం.

**- రంగారావు**
**రైతు, మాదేపల్లి**

### అప్పుల ఊబిలో రైతులు

వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన సున్నావడ్డీ పథకం అమలు కాకపోవడం, ప్రభుత్వ నిర్ణయాలతో అప్పుల ఊబిలోకి కూరుకుపోయాం. సున్నావడ్డీ పథకం అమలు కాలేదు. తీసుకున్న లక్ష రుణానికి ప్రతి ఏడాది వడ్డీలు చెల్లించి పంట రుణాలు రెన్యువల్ చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైంది.

**- రామారావు**
**రైతు, జాలిపూడి**

### అన్నీ వట్టి మాటలే

ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఆచరణలో కనిపించడం లేదు. అన్ని వట్టి మాటలే. గత రెండేళ్ళుగా సున్నావడ్డీ పథకం అమలు కాలేదు. బ్యాంకులకు వెళ్లి వడ్డీలు చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకుంటున్నా ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో విఫలం అయ్యారు. ఇంతటి దారుణమైన ప్రభుత్వ విధానాన్ని చూడలేదు.

**- శ్రీనివాస్**
**రైతు, కాట్లంపూడి**

## మబ్బులతో ఆక్సిజన్ సమస్య

- రొయ్యలు, చేపలు మృత్యువాత
- రూ.కోట్ల మేరకు ఆస్తి నష్టం

7





అలంకరణలో మద్ది ఆంజనేయస్వామివారు

## సువర్చలా హనుమద్ కల్యాణోత్సవం

బుట్టాయగూడెం, జూన్ 2 :జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో మద్ది ఆంజనేయస్వామి హనుమద్ జయంతి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయమున స్వామికి నిత్య అర్చన, నిత్య హోమం, బలిహరణలు, సాయంత్రం గ్రామోత్సవ కార్యక్రమాలను నిర్వహించామని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులకు స్వామివారి ప్రసాద వితరణతోపాటు అన్నసమారాధన జరిపామన్నారు. ఉత్సవాల్లో భాగంగా విజయవాడకు చెందిన ప్రసాదరావు బృందంచే భక్తి సంగీత విభావరి కార్యక్రమం జరిగింది.

## క్రైం కార్నర్

### వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 2: ఉపాధి హామీ పని చేస్తూ కూలి గుండెపోటుతో మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అలపాటి వెంకట్రావు(58) పంటబోదె తవ్వుతుండగా గుండెపోటు రావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు తెలిపారు.

● ఏలూరు క్రైం : రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. అస్సాం రాష్ట్రానికి చెందిన దూడుల్ బోనుష్ (29) తన మామయ్యతో కలిసి చేపల చెరువుకు మేత వేసే పనికి ఏలూరుకు వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. భీమడోలు రైల్వే స్టేషన్ దాటిన తరువాత ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. బోగీలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు జారి పడ్డాడని గుర్తించారు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్‌ఐ డి.నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నరసాపురం రూరల్, జూన్ 2: తేనేటీగల దాడిలో తీవ్రంగా గాయపడి


నర్సింహాస్వామి

చికిత్స పొందుతున్న నర్సింహా స్వామి(60) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. గొంది గ్రామంలో తోటి కార్మికులతో కలిసి గత నెల 31వ తేదీన ఉపాధి పనులు చేస్తుండగా నర్సింహాస్వామి, నాగేశ్వరరావు పై తేనేటీగలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దర్ని పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగేశ్వరరావుకు మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.... నర్సింహాస్వామి మాత్రం పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నర్సింహాస్వామికి మెరుగైన వైద్యం అందినప్పటికీ మృతి చెందడంతో గొంది గ్రామంలో విషాదం అలుముకుంది. గతంలో తీర ప్రాంతాల్లో ఈ తరహా తేనేటీగలు కుట్టి ఒక్కరూ మృతి చెందారు. నర్సింహాస్వామి పార్థదేహాన్ని ఎంపీడీవో రమణరావు, సర్పంచ్ మద్దాల అంజిబాబు, వైఎస్ నాగేశ్వరరావు సందర్శించి సంతాపం తెలిపారు.

### విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన చేపల లోడు లారీ

ఆకివీడు, జూన్ 2: చేపల లోడుతో వెళ్తున్న లారీకి డ్రైవర్ బ్రేక్ వేయడంతో స్కిడ్ అయి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఆదివారం ఆకివీడు నుంచి అజ్జమూరు వెళ్తున్న చేపల లోడు లారీ అజ్జాలమ్మ ఆలయం మలుపు దగ్గర డ్రైవర్ బ్రేక్ వేయగా జారీ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న కార్మికులు కిందపడ్డి గాయాలపాలయ్యారు. వీరిని ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. విద్యుత్ అధికారులు, సిబ్బంది వచ్చి స్తంభాన్ని సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

### విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 2 : తన కమార్తె ఇంటి నుంచి కాలేజీకి వెళ్లి తిరిగి రాలేదని తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దెందులూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన విద్యార్థిని(21) డిగ్రీ చదువుతుంది. ప్రతి రోజు ఆర్టీసీ బస్సులో కళాశాలకు వెళ్లివచ్చేది. గత నెల 31వ తేదీన కాలేజీకి వెళ్లిన ఆమె ఇంటికి చేరుకోలేదు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**దొంగతనంపై...**

పెదపాడు, జూన్ 2 : తాళ్లమూడిలో జరిగిన దొంగతనంపై పెదపాడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన చొప్పవరపు రామ్మోహనరావు కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 28వ తేదీన వేరే గ్రామానికి వెళ్లారు. జూన్ ఒకటో తేదీన ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించి, పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరకాసు బంగారు దిద్దులు, రూ.15 వేల నగదుతో పాటు వెండి వస్తువులు పోయినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పెదపాడు ఎస్‌ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

### రెండు కోళ్లవ్యర్థాల వాహనాల పట్టివేత

పెదపాడు, జూన్ 2 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, తోటగూడెం గ్రామాల వద్ద వాహనాలను తనిఖీ చేసి రెండు వాహనాలను పట్టుకున్నట్లుగా ఎస్‌ఐ కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులు, వాహన డ్రైవర్లపై కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు : ఏడుగురికి గాయాలు


ట్రావెల్ బస్సు ముందు భాగం

దేవరపల్లి, జూన్ 2: లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రం గాను, ఆరుగురికి స్వల్పంగాను గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఆది వారం ఉదయం దేవరపల్లి మండలం బందపురం జాతీయ రహదారిపై లారీ సెల్ఫ్ ఆగిపోవడంతో నెమ్మదిగా వెళ్తుండగా హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో 35 మంది ప్రయాణిస్తుండగా అందులో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీహరిరావు తెలిపారు.

# నాటక పరిషత్‌ల కృషి ఎనలేనిది

- ప్రముఖ రంగస్థల నటీమణి రత్నకుమారికి సత్కారం
- నాలుగో రోజు రెండు నాటికల ప్రదర్శన

భీమవరం అర్బన్, జూన్ 2: కనుమరుగవుతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి నాటక పరిషత్‌లు చేస్తున్న కృషి ఎనలేనిదని పలువురు వక్తలు అన్నారు. చైతన్యభారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరంలోని డీఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియ స్కూల్ ఆవరణంలో జరుగుతున్న 17వ జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలలో నాలుగో రోజు ఆదివారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ముందుగా ఈ నాటిక పోటీలను మావుళ్లమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ కారుమురి సత్యనారాయణ, సూర్య మిత్ర చైర్మన్ ఇర్రింకి సూర్యరావు, సీనియర్ న్యాయవాది తాడిమళ్ల గిరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆజో,విభో,కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్ర మూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటీమణి ఎం.రత్నకుమారికి పెనుపోతుల శేషగిరిరావు రంగస్థల చైతన్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆనంతరం ప్రదర్శించిన రెండు నాటికలు ఆహూతులను కళా ప్రియులను అలరించాయి. నాటక పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కట్రేడ్డి సత్యనారాయణ, వడుపు గోపి పాల్గొన్నారు. నాటికల న్యాయ నిర్ణేతలుగా మనాపురం సత్యనారాయణ, పంపన ధనంబాబు, డాక్టర్ ఎన్‌వీ కృష్ణారావు వ్యవహరించారు.


రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం అందుకుంటున్న అప్పాజోస్యుల సత్యనారాయణ

**'స్వప్నం రాల్చిన అమృతం'**

'ఒక కాకికి దెబ్బతగిలి కిందపడితే పది కాకులు చుట్టు చేరి కావు... కావు అంటూ అరుస్తాయి.. వాటి మధ్య ఏ బంధాలు సంబంధాలు లేకపోయినా సరే సాటి కాకులుగా గొప్ప సానుభూతిని చూపిస్తాయి. భార్య భర్తల బంధానికి అనుబంధానికి విలువనిచ్చే మనుషులం.. ఆ కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనలో లేకపోతే ఎలా' అని తెలియజేప్పిన స్వప్నం రాల్చిన అమృతం నాటిక, మూలకథ పీఎస్ నారాయణ, నాటీకీకరణ రచన పరమాత్ముని శివరాం, రమేష్ మంచాల దర్శకత్వం వ్యవహరించగా.. నటీనటులు తమ పాత్రలతో అందరిని అలరించారు. చివరి నాటికగా వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం వారి 'ఎనిమి' నాటిక ప్రదర్శంచారు.


స్వప్నం రాల్చిన అమృతం నాటికలోని సన్నివేశం

## షాపుల ఆక్రమణలు తొలగింపు



బస్టాండ్ రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పాలకొల్లు అర్బన్, జూన్ 2 : చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణ మునిగిపోయి ప్రయాణికులు అవస్థలు పడుతున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో గతవారం వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కొంత కాలం క్రితం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో పట్టణంలోని కచ్చా డ్రైన్లలో సిల్ట్ తీయించారు. అయితే బస్టాండ్ సమీపంలో గల డ్రైన్లను షాపుల వారు ఆక్రమించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం వేయడంతో పూర్తిగా పూడుకుపోయాయి. దీంతో మురుగు నీటి పారుదల లేక రోడ్లపైకి, బస్టాండ్ ఆవరణలోకి నీరు చేరుతోంది. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణ మురుగు నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కమిషనర్ ఇతర అధికారులు స్పందించి, శని, ఆదివారాల్లో జేసీబీలతో షాపుల ముందు ఆక్రమణలు, మున్సిపల్ కాంప్లెక్స్ వద్దనే డ్రైనేజీపైన వేసిన సిమెంట్ పలకలు తొలగించారు. తాము వ్యాపారాలు కోల్పోతున్నామని, అద్దెలు ఏలా కట్టగలమని కాంప్లెక్స్‌లో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా కౌన్సిల్ లేకపోవడం, అధికారులు పట్టించుకోకున్నా, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రాడంతో మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, ఆర్ఐ శ్రీనివాస రాజు, టీపీవో బ్రహ్మం, టీపీఎస్ త్రినాధరావు సిబ్బంది ఆక్రమణలు తొలగించి, డ్రైన్లలో సిల్ట్ తొలగించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కృష్ణబాబుకు ఘన నివాళి


మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుకు నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు


మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కొవ్వూరు, జూన్ 2 : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరులో జరిగిన కృష్ణబాబు దశ దిన కార్యక్రమానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు విచ్చేసి కృష్ణబాబు సోదరుడు ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ చైర్మన్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)తో పాటు కృష్ణబాబు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, సినీ నిర్మాత కేఎల్ నారాయణ, కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ మంత్రులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు, కామినేని శ్రీనివాస్, కావూరి సాంబశివరావు, డొడ్డికర్ల సువర్ణరాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామ్, టీవీ రామారావు, అవినాష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటి సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, ఇమ్మణి వీరశంకరం, కేవీకే రంగారావు తదితరులు కృష్ణబాబుకు నివాళులర్పించారు.

## కిక్కిరిసిన శ్రీవారి క్షేత్రం


క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

ద్వారకాతిరుమల, జూన్ 2: చిన్నతిరుమలేశుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 15 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. వీరంతా ముందుగా ఆలయంలో మొక్కు బడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకు న్నారు. అనంతరం శ్రీవారి వకుళమాత అన్నదాన భవనంలో అన్నప్రసాదం స్వీకరించారు.

## సిరులు కురిపిస్తున్న పసుపు బంగారం

### హర్షం వ్యక్తం చేస్తున్న పొగాకు రైతులు


గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

గోపాలపురం, జూన్ 2: ఉత్తరాంధ్ర తేలిక నేలల్లో పండే ఎస్ఎల్ఎస్ పొగాకు పంట లేకపోతే రైతుకూలీలకు గొప్పెడు మెతుకులు లేవనే సామేత నాడు ప్రస్తుత పొగాకు రైతు పరిస్థితి పొగాకు సాగుతో సిరులు కురిపిస్తుంది. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియ పొగాకు గత 50ఏళ్ళ చరిత్రలో ఎన్నడు ఎరుగని విధంగా అత్యధిక ధర పలుకుతుంది. ఈ ప్రాంతంలో పండే పంట దేశంలోనే నాణ్యమైన పొగాకు కావడం ఇతర దేశాలు, రాష్ట్రాల్లో ఈ ఏడాది పొగాకు పంటలో ఒడిదుడుకులు ఎదురవటం వెరసి ఈ ప్రాంత పొగాకు రైతులకు పసుపు బంగారంగా పిలువబడే పొగాకు సాగు సిరులు పంటగా మారింది. గ్రేడ్ - 1 పొగాకు కనీస మద్దతు ధర కంటే నిర్థిష్టమైన ధర పలకటంతో తమ కష్టానికి ఫలితాన్ని ఈ ఏడాది అయినా చూస్తున్నామని పొగాకు రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పంటకు గిట్టుబాటు ధర వచ్చిన మరుసాటి ఏడాది నుంచి ఈ ప్రాంతంలో అభివృద్ధి సైతం పరుగులుపెడుతుంది. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఇప్పటికే అత్యధికంగా పెరిగిన భూమి కౌలు, క్యూరింగ్ కార్మికులకు అత్యధికంగా పెరిగిన కూలి రేట్లు బేరర్ లైసెన్సులు ఇలా అభివృద్ధికి అన్ని రూపాల్లోనూ ఈ సాగు తోడ్పాటు ఇస్తుందని పొగాకు రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

| ఊరి పేరు | గరిష్ఠ ధర | కనిష్ఠ ధర | సరాసరి ధర |
|---|---|---|---|
| దేవరపల్లి | 331 | 222 | 293.75 |
| జంగారెడ్డిగూడెం -1 | 331 | 235 | 291.56 |
| జంగారెడ్డిగూడెం - 2 | 331 | 235 | 295.27 |
| కొయ్యలగూడెం | 332 | 235 | 294.03 |
| గోపాలపురం | 332 | 222 | 301.93 |

## వడ దెబ్బకు ఒకరి మృతి

నూజివీడు టౌన్, జూన్ 2: వడదెబ్బకు వ్యక్తి మృతి చెందిన ఘటన నూజివీడు పట్టణంలో చోటుచేసుకుంది. ముసునూరు మండలం గోపవరానికి చెందిన వెలివెల రత్తయ్య (55) ద్విచక్ర వాహనం కొనుగోలు కోసం శనివారం నూజివీడు వచ్చాడు. అనంతరం మద్యం సేవించిన అతను ఎండ దెబ్బకు నూజివీడు రైతు బజారు వీధిలోని ఓ దుకాణం వద్ద పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఎండ తీవ్రత నేపథ్యంలో అతడు అస్వస్థతకు గురై మృతిచెందిన విషయాన్ని స్థానికులు ఆదివారం ఉదయం గుర్తించి నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతనివద్ద గల సెల్‌ఫోన్ ఆధారంగా రత్తయ్య మృతి విషయాన్ని అతని కుమారుడు అరుణకుమార్‌కు తెలిపి మృతదేహాన్ని అప్పగించారు.

## మబ్బులతో ఆక్సిజన్ సమస్య

- రొయ్యలు, చేపలు మృత్యువాత
- భారీగా నష్టపోతున్న రైతులు

మండవల్లి, జూన్ 2: వాతావరణ మార్పులతో ఆక్వా రంగం అతలా కుతలమవుతోంది. ఉక్కపోత ఆక్వా సాగుకు పెనుముప్పుగా మారింది. రొయ్యల చెరువులో ఆక్సిజన్ కొరత తీవ్ర స్థాయికి చేరి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉష్ణోగ్రత పడిపోవడంతో చెరువుల్లో పీహెచ్‌సీ శాతం తగ్గిపోయింది. మండవల్లి సమీపంలోని ఒక గ్రామ రైతుకు చెందిన 12 టన్నుల 32 కౌట్ రొయ్యలకు ఆక్సిజన్ సమస్య ఏర్పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రూ.50 లక్షల వరకు ఆ ఒక్క రైతుకి ఆస్తి నష్టం సంభవించింది. ఇదే అదునుగా రొయ్యల ధరను గణనీయంగా తగ్గించి ఎగుమతుదారులు సిండికేట్‌గా మారి సొమ్ము చేసుకుంటున్నారు. రొయ్యలతో పాటు వాతావరణ సమస్య చేపలపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. చెరువులో ఆక్సిజన్ అందక చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయి. చనిపోయిన చేపలను మార్కెట్‌కు తరలిస్తే కేజీ రూ.10 నుంచి రూ.20లకు మించి కొనుగోలు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులకు దిక్కుతోచని స్థితి ఏర్పడింది. రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిరుగుతున్నప్పటికి ఆక్సిజన్ సమస్య ఎదురవడంతో రైతులకు నష్టం తప్పడం లేదు. ఏదేమైనా రెండు రోజులుగా వాతావరణం మార్పు కారణంగా రొయ్యలు, చేపల రైతులకు భారీగానే నష్టం వాటిల్లిందని అంచనా.


రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్స్

## ఆర్టీసీ బస్సుని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

**29 మందికి గాయాలు**

ముమ్మిడివరం, జూన్ 2: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో 29 మంది గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బోలేరో వ్యాన్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు, మరో 25 మంది గాయపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో డ్రైవరుతో పాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. కాకినాడ నుంచి అమలాపురం వెళుతున్న మరో ఆర్టీసీ బస్సు కోరంగి వద్ద ఆగిపోవడంతో ఆ బస్సులో ఉన్న ప్రయాణికులను కూడా ప్రమాదానికి గురైన బస్సులోకి ఎక్కించడంతో బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సులో గాయపడిన డ్రైవరుతో పాటు 25 మంది ప్రయాణికులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వారిలో 12 మంది క్షతగాత్రులను అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో అంబాజీపేటకు చెందిన డి.రామసీత, కాకినాడకు చెందిన జి.శ్రీనివాస్, భీమవరానికి చెందిన డి.జాన్‌బాబు, గుత్తెనదీవికి చెందిన సీహెచ్ కృష్ణవేణి, అమలాపురానికి చెందిన కె.సాయివేణి, అయినాపురానికి చెందిన ఎస్.కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారంత స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో గాయపడిన డ్రైవరు, ఇద్దరు ప్రయాణికులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌ఐ బి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### లైంగిక దాడి కేసుపై విచారణ

ముసునూరు, జూన్ 2: మండలంలోని ఒక గ్రామంలో లైంగిక దాడి కేసుపై నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య ఆదివారం విచారణ నిర్వహించారు. కొండపల్లి చెన్నారావు అత్యాచారం చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై డీఎస్పీ సూరేపల్లిలో సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు, నిందితుడి మధ్య గతంలో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? తదితర అంశాలపై చుట్టు పక్కలవారిని విచారించి, వివరాలు సేకరించారు. లైంగిక దాడికి పాల్పడిన ప్రాంతాన్ని అయన పరిశీలించారు. సమగ్ర నివేదికను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతికి నివేదిస్తామని తెలిపారు. ఈ విచారణలో ఎస్‌ఐ పి.వాసు, వీఆర్వో సుబ్బారావు, మహిళా పోలీస్ కరుణ, స్టేషన్ రైటర్ భాగ్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు ఎస్టీ కాలనీలో అనుమానితులను ప్రశ్నిస్తున్న సీఐ రఘు



ముదినేపల్లిలో విజిబుల్ పోలీసింగ్

## అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కేసులు

- కైకలూరు టౌన్ సీఐ రఘు
- భుజబలపట్నంలో పికెట్ ఏర్పాటు
- విజిబుల్ పోలీసింగ్‌తో పాటు పలుచోట్ల కార్డన్ సెర్చ్

కైకలూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఈ నెల 4న నిర్వహిస్తున్నందున గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కేసులు నమోదవుతాయని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు హెచ్చరించారు. ఆదివారం కైకలూరు ఎస్టీ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఆరా తీస్తున్నామని, ఏ విధమైన రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కైకలూరు రూరల్ పోలీసులు మండలంలోని సమస్యాత్మకమైన భుజబలపట్నం గ్రామంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం భుజబలపట్నంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ముందస్తుగా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

### గ్రామాల్లో కవాతు

**ముదినేపల్లి:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు పోలీసు శాఖ ముదినేపల్లి మండలంలో రంగంలోకి దిగింది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ రావటం, ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు టెన్షన్‌లో ఉండటం, మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుండడంతో గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముదినేపల్లి ఎస్‌ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ముదినేపల్లి, వడాలి, సింగరాయపాలెం, బొమ్మినంపాడు, పెదపాలపర్రు, గురజ, చిగురుకోట గ్రామాల ఏరియాల్లో పోలీస్ పహరా నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.



చింతలపూడి సబ్‌జైలు అధికారులతో మాట్లాడుతున్న పురుషోత్తం కుమార్

## చింతలపూడి సబ్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి

చింతలపూడి, జూన్ 2: ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తమ్‌కుమార్ ఆదివారం చింతలపూడి సబ్ జైలును సందర్శించారు. ఖైదీల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార సదుపాయాలు, మంచినీటి సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, సోషల్ వర్కర్ అక్బర్‌అలీ, బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా న్యాయమూర్తిని కలిశారు.

## దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

భీమడోలు, జూన్ 2: గుండుగొలను విఘ్నేశ్వర దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం నిత్యావసర సరుకులు, పోషకాహారాలను అందజేశారు. 55 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమంలో భాగంగా సన్నబియ్యం, మామిడిపళ్ళు, పోషకాహారాన్ని మామిళ్ళపల్లి ఆదినారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందజేశారు. దాతల సహాయ సహకారాలతో దివ్యాంగులకు సాయం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వైద్యులు హరికిషన్, దీపిక, మామిళ్ళపల్లి రామకృష్ణ, వంగపండు సతీష్, హనుమలను హరికృష్ణ దంపతులను నిర్వాహకులు సత్కరించారు. పేరిచర్ల శ్యామలరాజు, కేశవరాజు, శ్రీనివాసరావు, సోములు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ నగదు ప్రోత్సాహకాలు

దెందులూరు, జూన్ 2: కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.60 వేలు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. దివంగత ఉపాధ్యాయుడు గొరిపర్తి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమలో ఆయన సోదరుడు వెంకట రామకృష్ణ ఆర్థిక సాయంతో నగదు ప్రోత్సాహకాలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సాయం అందజేశారు. అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ చైర్మన్ కట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హరికృష్ణ మాస్టార్‌కు ఘనంగా నివాళులర్పించారు. విద్యావ్యాప్తికి కృషి చేసిన ఆయన యువత, విద్యార్థులకు ఆదర్శమన్నారు. విద్యార్థులు అర్తాల తనుశ్రీ, నక్కా హర్షగోపాల్, కంచన పార్వతీ ప్రియాంక, వేమూరి వీరవాణి, దాసరి హరికుమార్, వాడపల్లి ఆదిత్యకు నగదు ప్రోత్సాహకాలు, 20 మంది వృద్ధులకు బియ్యం, అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఆర్థిక సహాయం అందించారు. అలపాటి నాగేశ్వరావు, ఎంఈవోలు కె.అన్నమ్మ, ఎస్‌వీఎస్ ప్రసాద్, హైస్కూల్ హెచ్ఎం శర్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తాఫాఅలీ, రామకృష్ణ, కస్తూరిరావు, గొరిపర్తి శివకొండ, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



చింతమనేని ప్రభాకర్‌తో అభిమానులు, నాయకులు

# టీడీపీ జోష్

### అంచనాకు మించి కూటమి విజయం సాధిస్తుందని ధీమా

### కౌంటింగ్‌పై కార్యకర్తలకు నేతల జాగ్రత్తలు



కామవరపుకోట సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ శ్రేణులు

పెదవేగి, జూన్ 2: ఎగ్జిట్ పోల్ అంచనాలతో టీడీపీ, కూటమి శ్రేణులు జోష్‌తో ఉన్నాయి. కూటమి భారీ విజయం సాధించబోతుందని, కౌంటింగ్‌లో కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని నేతలు సూచిస్తున్నారు. అంచనాలకు మించి ఎన్డీఏ కూటమి భారీ ఆధిక్యతతో విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని కార్యాలయంలో చింతమనేనిని ఆదివారం టీడీపీ శ్రేణులు కలిశారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనకు మరో రెండు రోజుల్లో తెరపడుతుందన్నారు. జగన్‌రెడ్డి రాక్షస పాలనతో ఐదేళ్లపాటు జనజీవనం అస్తవ్యస్తమైందన్నారు. ఎన్డీయే కూటమి విజయంతో సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా రాష్ట్రం పయనిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించిన సీట్లు సాధించి ఎన్డీయే కూటమి దేశం, రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ఆయన ఆత్మవిశ్వాసంతో చెప్పారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో ప్రజలు పండుగ చేసుకుంటారని, ఐదేళ్ల జగన్‌రెడ్డి పీడ వదిలిపోతుందని జనం ఇప్పటికే సంబరాల్లో మునిగితేలుతున్నారని ఆయన తెలిపారు. ఎన్డీయే కూటమి విజయం ఎప్పుడో ఖరారైందని, ఇక ఓట్ల లెక్కింపు ఒక్కటే మిగిలి ఉందని, ఎన్డీయే ప్రమాణస్వీకారమే తరువాయి అని ప్రభాకర్ వివరించారు.

### అంచనాలకు మించి ఫలితాలు

కామవరపుకోట: టీడీపీ కూటమికి అంచనాకు మించిన ఫలితాలు వస్తాయని టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలు, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు ప్రకటన నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు కూటమి వైపు మొగ్గు చూపారని, కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, నెక్కలపు సూర్యనారాయణ అన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండాలని, 144వ సెక్షన్ అమలులో ఉన్నందున నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యర్థులు ఘర్షణలకు పాల్పడతారని, వాటిని సమన్వయంతో ఎదుర్కోవాలని, ఘర్షణలకు పాల్పడవద్దని చెప్పారు. ఫలితాలు తొలి నుంచి కూటమికి అనుకూలంగా రావడంతో ప్రతిపక్షాలు పన్నాగం పన్నుతారని జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. గంగాధరరావు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, కోనేరు వెంకట్రామయ్య, జయప్రకాష్, మోహన్, తదితరులు ఉన్నారు.

### కూటమిదే అధికారం

కొయ్యలగూడెం: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్ సర్వేలో కూటమికి అనుకూల ఫలితాలు రావడం శుభ సూచికమన్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వానికి మింగుడుపడటం లేదన్నారు. కూటమి అధికారంలోకి రావడం తథ్యమని, డబల్ ఇంజన్ సర్కారు ద్వారా ఇటూ రాష్ట్రాన్ని అటూ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించడం సులభతరం అవుతుందన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని తెలిపారు. గత ఐదేళ్లుగా పరిపాలన వదిలేసి సొంత స్వలాభం కోసం వైసీపీ నేతలు పని చేశారని మేఘలాదేవి విమర్శించారు. రాబోయే కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు.

### జన సేన నేతలంతా అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు కార్పొరేషన్: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పవరుపేటలోని జనసేన కార్యాలయంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. 144వ సెక్షన్ అమలులో ఉన్నందున పోలీసు ఆంక్షల మేరకు కార్యకర్తలు నడుచుకోవాలని, ఎటువంటి వివాదాలకు వెళ్ళవద్దని సూచించారు. కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యర్థులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సంయమనంతో ఉండాలని, అధికారుల ద్వారా వాటిని నియంత్రించే చర్యలు ఏర్పడాలని, ఘర్షణలకు వెళ్ళవద్దని సూచించారు. జనసేన నగర అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, నేతలు పైడి లక్ష్మణరావు, ఎట్రించి ధర్మేంద్ర, రవి, శివ, నూకల సాయి, బోండా రామునాయుడు, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఏలూరులో వాహన డ్రైవర్‌తో ఫేస్‌వాష్ చేయిస్తున్న పోలీసులు



జీలుగుమిల్లిలో ఎస్సై చంద్రశేఖర్ సిబ్బంది వాహనాల తనిఖీ

# జిల్లాలో విస్తృతంగా వాహన తనిఖీలు

ఏలూరు క్రైం, జూన్ 2 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ జూన్ 6 వరకూ అమలులో ఉండడంతో పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా తనిఖీ నిర్వహిస్తున్నారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రివేళ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకోసం జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో వెళ్ళే వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. లాడ్జీలను కూడా తనిఖీ చేస్తున్నారు. పోలీస్ పికెట్లను, ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈవీఎంలను సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన నేపథ్యంలో మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. పరిసరాల్లోకి ఎవరూ రాకూడాదని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.

● జీలుగుమిల్లి: ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఆంధ్ర తెలంగాణ సరిహద్దు గ్రామం జీలుగుమిల్లిలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎస్సై వి.చంద్రశేఖర్ రాత్రి సమయంలో గిరిజన గ్రామాలకు ఎటువంటి మందుగుండు సామగ్రి, అక్రమ మద్యం తరలిపోకుండా తనిఖీ చేస్తున్నారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, డ్రంకెన్ డ్రైవ్, రికార్డులు పరిశీలించారు.

● నిడమర్రు: ఎన్నికల ఫలితాలు వెడువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు ఘర్షణ, ఉద్రేకాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ఎస్ఐ ఆర్.శ్రీను అన్నారు. మండలంలో పలు గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించి, గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు నిర్వహించాలని ఎన్నికల అనంతరం ప్రజలందరూ కలసిమెలసి జీవించాలని అపోహలుతో అనర్థాలు తెచ్చుకోవద్దని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే వారిపై కఠినచర్యలు తీసుకొంటామన్నారు.

## కూటమి అధికారంలోకి రావాలని పూజలు

పెదపాడు, జూన్ 2 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, దెందులూరు ఎమ్మెల్యేగా చింతమనేని ప్రభాకర్ విజయం సాధించాలని తోటగూడెంలో టీడీపీ సానుభూతిపరులు ఆదివారం గంగానమ్మకు పూజలు చేశారు. టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో మహిళలు గంగానమ్మకు పసుపు, కుంకుమ, వేపాకులతో కూడిన నీళ్లను అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కూటమి అధికారంలోకి వస్తుందని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ కమిటీ అధికార ప్రతినిధి గుత్తా అనిల్, టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు, జూన్ 2 : సూరప్పగూడెం 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. భీమడోలు, సూరప్పగూడెం, పోలసానపల్లి, గుండుగొలను, లింగంపాడు, కోరుకొల్లు, రత్నాపురం, గోడాపురం, వడ్డిగూడెం, లక్ష్మీపురం, ఆగడాల లంక, చెట్టున్నపాడు గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఈఈ బి.నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కోడి పందేల్లో ముగ్గురి అరెస్టు

జీలుగుమిల్లి, జూన్ 2 : పి.రాజవరంలో కోడిపందేల స్థావరంపై ఎస్సై వి.చంద్రశేఖర్ సిబ్బందితో కలసి దాడి చేశారు. పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1050 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



ఏలూరు కాల్వలో గుర్రపు డెక్క

కైకరం వంతెన వద్ద చెత్త

# సాగు నీరందేనా?

### ఏలూరు కాల్వలో పేరుకుపోయిన తూడు, చెత్త

### సార్వా సాగుపై రైతుల ఆందోళన

ఉంగుటూరు, జూన్ 2: ఏలూరు ప్రధాన కాల్వకు నీరు విడుదల చేసారు. సార్వా సీజన్ ప్రారంభం కావడంతో సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఏలూరు కాల్వతో పాటు పంట కాల్వలు తూడు, చెత్తతో పూడిపోవడంతో సాగు నీరు అందే పరిస్థితి లేదు. ఏలూరు కాల్వ నీటినే తాగు నీటి అవసరాలకు కూడా వాడడంతో కలుషితమై సమీప గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. వేసవిలో కాల్వ మరమ్మతులు, ఆధునికీకరణ పనులను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిధుల లేమితో కాల్వలో రేవులను శుభ్రం చేయడం, వంతెనల వద్ద చెత్తాచెదారం తొలగించడంలో అధికారులు విఫలమయ్యారు. ప్రస్తుతం కాల్వకు నీరు వదలడంతో తూడు అడ్డుపడడంతో సాగు అవసరాలకు సరిపడా నీరు అందదని, శివారు భూములకు మరిన్ని ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. ఇటీవల దాళ్వా సీజన్‌లో కైకరం శివారులో కాల్వ గట్టుకు సమాంతరంగా నీరు ప్రవహించడం రైతులను భయపెట్టింది. ప్రస్తుతం సాగు నీరు అందకపోగా వర్షాలు కురిస్తే పంట ముంపు బారిన పడుతుందని రైతులు భయపడుతున్నారు.



ధర్మాజీగూడెం గ్రంథాలయంలో చదరంగం ఆడుతున్న విద్యార్థులు



పెదవేగి గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం

# విద్యార్థులు ఆటల్లో కూడా ముందుండాలి

లింగపాలెం, జూన్ 2: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో ముందుండాలని, గేమ్స్ కూడా జీవితంలో ఒక భాగమేనని ధర్మాజిగూడెంశాఖ గ్రంథాలయాధికారి సీహెచ్.వెంకటరమణ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజిగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులతో పలు కథలు చదివించి వాటిలోని నీతిని వివరించారు. అనంతరం విద్యార్థులకు మేథమ్యాటిక్స్, తెలుగు గ్రామర్, పలు అంశాల పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో పలు ఆటలు ఆడించారు. చెస్, క్యారమ్స్, స్కేటింగ్ లాంటి పలు ఆటలు ఆడించారు. విద్యార్థులు తమ జీవితంలో ఆటలను కూడా ఒక భాగంగా ఎంచుకోవాలని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలను సందర్శించాలని గ్రంథాలయాల్లో విజ్ఞానానికి సంబంధించిన అనేక పుస్తకాలు దొరుకుతాయని అన్నారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్ ఏవీ.నారాయణ, ఎం.జ్యోతిప్రియాంక, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదవేగి, జూన్ 2: గ్రంథపఠనం అభివృద్ధికి చిహ్నమని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చేతిరాత పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు చేతిరాత పరీక్షా పోటీల్లో పాల్గొన్నారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. గ్రంథాలతో గడిపే ప్రతిక్షణం ఎంతో విలువైనదని, గ్రంథపఠనంతోపాటు ఇతర విజ్ఞానదాయక అంశాలను నేర్చుకోవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయ దర్శనం చేయాలని, అప్పుడే నిజమైన విజ్ఞానం మనసొంతమవుతుందని ఆయన వివరించారు. విజ్ఞానదాయకమైన పుస్తక పఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు.

## ప్రయాణం.. ప్రమాదమే..!



కిక్కిరిసిన ట్రక్కుల్లో ప్రయాణిస్తున్న కూలీలు

కిక్కిరిసిన ప్రయాణికులు, పరిమితికి మించిన లోడుతో వాహనాలు ప్రమాదకరంగా మారాయి. ప్రమాదమని తెలిసినా పనుల నిమిత్తం వెళ్లే కూలీలు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. భీమడోలు - ద్వారకా తిరుమలకు రహదారిలో తిమ్మాపురం, పంగిడిగూడెం వద్ద అధిక సంఖ్యలో ప్రయాణికులతో వెళుతున్న వాహనాలు, అధిక లోడు వాహనాల రాకపోకలు నిత్యకృత్యం. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

- ద్వారకా తిరుమల



పోచమ్మ గుడికి వెళ్లడానికి రేవులో వేచిఉన్న భక్తులు

### భక్తులకు దూరమైన

# గండి పోచమ్మ

### పోలవరం స్పిల్‌వేపై రాకపోకలకు వీలులేదు

### రాజమహేంద్రవరం మీదుగా వెళ్లాల్సిందే

పోలవరం, జూన్ 2: పోలవరం ప్రాజెక్టు ఎగువన గండి పోచమ్మ అమ్మవారు భక్తులకు కొంగు బంగారం. రానున్న వర్షాకాలం అమ్మవారి ఆలయానికి వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రస్తుతం ఆలయా నికి రద్దీ పెరిగింది. ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. పోలవరం ప్రాజె క్టు ఎగువన అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరులో గోదా వరి ఒడ్డున గండి పోచమ్మ ఆలయం ఉంది. పోలవరం ప్రాజెక్టు నిర్మా ణంలో భాగంగా ఎగువ కాఫర్ డ్యాం ఎగువన ఆలయం ఉంది. దీనితో ఎగువ కాఫర్‌డ్యాం నుంచి జలాలు వెనుదిరిగి మూడు కిలోమీటర్ల మేర ప్రయాణించి స్పిల్‌వేలో వెళ్లడంతో ఆలయం వర్షాల సీజనులో సుమారు 4 నెలల పాటు పూర్తిగా నీట మునిగి ఉంటుంది. రానున్న వర్షాల సీజన్ దృష్టిలో పెట్టుకున్న భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి ఉభయ గోదావరి జిల్లాల నుంచి తండోపతండాలుగా వెళుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాసులు పోలవరం చేరుకుని అక్కడి నుంచి పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు. ప్రాజెక్టు భద్రతా బలగాలు ఆ మార్గాన భక్తులు వెళ్ళడానికి నిరాకరిస్తుండడంతో పాత పోలవరం శివారులో పురుషోత్తపట్నం రేవు నుంచి పురుషోత్తపట్నం చేరుకుని అక్కడి నుంచి ఆటోలపై ఆలయానికి వెళుతున్నారు. లేకుంటే వాహనాలపై రాజమహేంద్రవరం, అక్కడి నుంచి సీతానగరం పురుషోత్తపట్నం మీదుగా వెళ్లాల్సిందే. అధికారులు స్పందించి పోశమ్మ గండికి భక్తుల రాకపోకలకు స్పిల్‌వే లేదా, ఎగువ కాఫర్ డ్యాం మీదుగా వెళ్ళడానికి అనుమతి ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

### గ్రామ దేవత కడమ్మకు నైవేద్యాలు

పోలవరం గ్రామ దేవత కడమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వారంరోజుల క్రితం గ్రామ నడిబొడ్డున ఉంచిన అమ్మవారి ఉత్సవ విగ్రహం, గరగలకు పూజాధికాలు నిర్వహించి పానకాలు, గారెలు బూరెల నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు పిల్లలు, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



గవరవరంలో గంగానమ్మకు భక్తుల పూజలు

### ముగిసిన గంగానమ్మ సంబరాలు

ఏలూరు కల్చరల్, జూన్ 2: గవరవరం చెరువుగట్టు వద్ద గంగానమ్మ సంబరాలు ఆదివారం ముగిశాయి. గతనెల 31 నుంచి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజూ విశేష పూజలు, అలంకారాలు నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత గంగానమ్మకు భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు ఆళ్ళమోహన్‌రావు, గుత్తుల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాసు, ఎస్.శివన్నారాయణ, కె.సూర్యకాంతం పర్యవేక్షించారు.

### యర్రగుంటపల్లిలో పెద్దమ్మ తల్లి జాతర

చింతలపూడి, జూన్ 2: యర్రగుంటపల్లిలో నాయకపోడుల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. జిల్లాలోని పలు గ్రామాలతో పాటు తెలంగాణ రాష్ట్రం దమ్మపేట, అశ్వారావుపేట, పలు ఏజన్సీ గ్రామాల నుంచి నాయకపోడులు ఉత్సవాలకు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మే 29న ఉత్సవాలు ప్రారంభం కాగా ఆదివారం ముగిశాయి. ముగింపు రోజు నిప్పుల గుండంపై నడుస్తూ భక్తులు మొక్కు చెల్లించుకున్నారు. సుమారు 100 సంవత్సరాల నుంచి నాయకపోడుల గ్రామాల్లో పెద్దమ్మ తల్లి పండుగ చేస్తారు. యర్రగొండపల్లిలో 40 ఏళ్లుగా పెద్దమ్మతల్లి జాతర నిర్వహిస్తున్నారు. వేల సంఖ్యలో కుటుంబాలతో తరలివస్తున్నారు. ముఖ్యంగా కొలబియ్యం, దేవుడి స్నానాలు, సరువులు కార్యక్రమాలు చేస్తామని గిరిజన పెద్దలు తెలిపారు. పెద్దమ్మ తల్లిని కొలవడం వల్ల తమ కష్టాలు తీరుతాయని, సుఖసంతోషాలతో ఉంటారని నమ్మకం. నాయకపోడు రాష్ట్ర అధ్యక్షుడు, జాతర నిర్వాహకుడు అప్పిరెడ్డి నాగు మాట్లాడుతూ తమ కులదైవం పెద్దమ్మ తల్లి ఉత్సవాలకు ఖర్చు అధికమని, గిరిజనుల జాతరను ఐటీడీఏ అధికారులు గుర్తించి ఉత్సవాలకు నిధులు అందించాలని కోరారు. ఉత్సవాల కోసం అడవి నుంచి తెచ్చే సామగ్రికి అటవీ అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. కుల పెద్దలు అల్లం అప్పారావు, సంకు మల్లికార్జునరావు, జగన్నాథం, నాగరాజు, రాఘవులు, శ్రీను, వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి ఉత్సవాలను పర్యవేక్షించారు.

## ఆధ్యాత్మికం



కుక్కునూరులో ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

### వైభవంగా ముత్యాలమ్మ పూజలు

కుక్కునూరు: కుక్కునూరు గ్రామ దేవత అయిన ముత్యాలమ్మకు ఆదివారం వైభవంగా పూజలు నిర్వహించారు. గ్రామ శివారులో ముత్యాలమ్మకు కొత్తగా ఆలయ నిర్మాణం చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు పానకాలు, ప్రసాదాలు అందజేశారు.

● టి.నరసాపురం: బొర్రంపాలెంలో నిర్వహిస్తున్న షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఆదివారం ముగిసింది. భక్తులు ఉదయం నుండే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

### రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి జూన్ 2: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలి నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు తగిన ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.



యర్రగుంటపల్లి పెద్దమ్మతల్లి జాతరలో నిప్పులగుండం

### హనుమజ్జయంతి ఉత్సవాలు



ఏలూరు కార్పొరేషన్, జూన్ 2: నగరంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమజ్జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పాతబస్టాండ్ సెంటర్ మర్రి అభయాంజనేయస్వామికి విశేష పూజలు, అభిషేకాలు, తమలపాకులు, సింధూర పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటరత్నం శర్మ భక్తులతో పూజలు చేయించారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద అర్చకులు శెనగల సురేష్‌కుమార్, సాయి రవికిరణ్‌లు భక్తులతో పూజలు చేయించారు. కత్తెపువీధిలోని అభయాంజనేయస్వామికి నదీ జలాలతో అభిషేకం, అర్చకులు కె.శ్రీనివాస్ భక్తులతో పూజలు చేయించారు. గులాబీతోట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉత్సవాలు కొనసాగుతున్నాయి. విశేష పూజలతో భక్తులు ఆరాధించారు.

● పెదపాడు: గండిచెరువుగట్టులోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదపాడు, పరిసర ప్రాంతాల్లోని సుమారు 2 వేలమంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పెదపాడు బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ 21వ హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు అన్నదాన నిర్వాహకులు రేములగడ్డ రాము తెలిపారు. పెదపాడు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

## మబ్బులతో.. ఆక్సిజన్ సమస్య

▸రొయ్యలు, చేపల మృత్యువాత ▸ రూ. కోట్ల నష్టం

మండవల్లి, జూన్ 2: వాతావరణ మార్పులతో ఆక్వా రంగం అతలా కుతలమవుతోంది. ఉక్కపోత ఆక్వా సాగుకు పెనుముప్పుగా మారింది. రొయ్యల చెరువులో ఆక్సిజన్ కొరత తీవ్ర స్థాయికి చేరి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతోందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉష్ణోగ్రత పడిపోవడంతో చెరువుల్లో పీహెచ్‌సీ శాతం తగ్గిపోయింది. మండవల్లి సమీపంలోని ఒక గ్రామ రైతుకు చెందిన 12 టన్నుల 32 కౌంట్ రొయ్యలకు ఆక్సిజన్ సమస్య ఏర్పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రూ.50 లక్షల వరకు ఆ ఒక్క రైతుకి ఆస్తి నష్టం సంభవించింది. ఇదే అదునుగా రొయ్యల ధరను గణనీయంగా తగ్గించి ఎగుమతుదారులు సిండికేట్‌గా మారి సొమ్ము చేసుకుంటున్నారు. రొయ్యలతో పాటు వాతావరణ సమస్య చేపలపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. చెరువులో ఆక్సిజన్ అందక చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయి. చనిపోయిన చేపలను మార్కెట్‌కు తరలిస్తే కేజీ రూ.10 నుంచి రూ.20లకు మించి కొనుగోలు చేయటంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆక్వా రైతులకు దిక్కుతోచని స్థితి ఏర్పడింది. రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిరుగుతున్నప్పటికీ ఆక్సిజన్ సమస్య ఎదురవడంతో రైతులకు నష్టం తప్పడం లేదు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పు కారణంగా రొయ్యలు, చేపల రైతులకు భారీగానే నష్టం వాటిల్లిందని అంచనా.

## ఎగ్జిట్ పోల్స్‌తో కూటమి నేతల్లో ఉత్సాహం

ముదినేపల్లి, జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ విడుదల కావటంతో ఎన్‌డీఏ కూటమి వర్గాల్లో ఆనందోత్సాహాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ఏర్పాటుతోపాటు కైకలూరు నియోజకవర్గ ఫలితం కూడా తమకు అనుకూలంగా రావటంతో తెలుగు దేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ముదినేపల్లి మండలంలో పలు చోట్ల కూటమి నాయకులు సమావేశాలు నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. కైకలూరు నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి గెలవ బోతున్నారన్న ఉత్సాహంతో పలువురు కార్యకర్తలు పందేలకు కూడా సిద్ధమవుతున్నారు. కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను కలసి శుభా కాంక్షలు చెబుతున్నారు. పలువురు ఫోన్లలో అభినందన సందేశాలతో హోరెత్తిస్తున్నారు. ముదినే పల్లి మండలంలో బూత్ స్థాయిల్లో కూటమి అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుందని అంచనాలు వేయటంలో గ్రామస్థాయి నాయకులు నిమగ్నమయ్యారు.

## మందుబాబుల ముందు జాగ్రత్త

### ముందస్తుగా మద్యం కొనుగోళ్లు!

ముదినేపల్లి రూరల్, జూన్ 2: ఓట్ల లెక్కింపు సందర్భంగా మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశాలుండడంతో మందు బాబులు మద్యం కోసం ఆదివారం బారులు తీరి ఒక్కొక్కరు రెండేసి సీసాలు చొప్పున కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. మరోపక్క బెల్టుషాపు నిర్వాహకులు సైతం ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బందితో కుమ్మక్కై దొడ్డిదారిన మద్యం కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో నాలుగు రోజుల నుంచి పర్యటించి బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం దొరికితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నా షాప్ నిర్వాహకులు ఏ మాత్రం బెదరకుండా మద్యం కొనుగోలు చేసి నిల్వ చేయటం గమనార్హం.

## కార్గో సేవల హామీ ఏమైంది సారూ..?

ఆగిరిపల్లి, జూన్ 2: ఆగిరిపల్లి నుంచి ఆర్టీసీ ద్వారా కార్గో సేవలను అందిస్తామని, ఆర్టీసీ అధికారులు ఇచ్చిన హామీ నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు. నూజివీడు పేరు చెప్తే మామిడి గుర్తుకు వస్తుంది. ఇక్కడి వారికి సంబంధించి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉన్న బంధువులు మామిడి సీజన్ వచ్చిందంటే తమ వారు ఎప్పుడు మామిడికాయలు పంపిస్తారా? అని ఎదురు చూస్తుంటారు. సదరు మామిడిని బంధువులకు పంపించాలంటే ఇక్కడ వారికి ఎంతో వ్యయ ప్రయాసతో కూడుకుంది. ఈ క్రమంలో ఇటీవల ఆగిరిపల్లి బస్టాండ్ సందర్శించిన ఆర్టీసీ రీజనల్ మేనేజరు వరప్రసాద్, ఆగిరిపల్లి నుంచి కార్గో సర్వీసులు నడపడంతో పాటు ఆగిరిపల్లి మీదుగా హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే మామిడి సీజన్ పూర్తి అయినా ఆ హామీ అమలు కాలేదు. మరోవైపు ఆగిరిపల్లి ఆర్టీసీ బస్టాండు ప్రైవేట్ ఆటోస్టాండ్‌గా మారిపోయిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండులో నిబంధనలు అమలుపరిచి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు రీజనల్ మేనేజరు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆగిరిపల్లి వాసులు కోరుతున్నారు.

## క్రైం సమాచారం

### వడదెబ్బతో ఒకరి మృతి

నూజివీడు టౌన్, జూన్ 2: వడదెబ్బకు వ్యక్తి మృతి చెందిన ఘటన నూజివీడు పట్టణంలో చోటుచేసుకుంది. ముసునూరు మండలం గోపవరానికి చెందిన వెలివెల రత్తయ్య (55) ద్విచక్ర వాహనం కొనుగోలు కోసం శనివారం నూజివీడు వచ్చాడు. అనంతరం మద్యం సేవించిన అతను ఎండ దెబ్బకు నూజివీడు రైతు బజారు వీధిలోని ఓ దుకాణం వద్ద పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఎండ తీవ్రత నేపథ్యంలో అతడు అస్వస్థతకు గురై మృతిచెందిన విషయాన్ని స్థానికులు ఆదివారం ఉదయం గుర్తించి నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతనివద్ద గల సెల్‌ఫోన్ ఆధారంగా రత్తయ్య మృతి విషయాన్ని అతని కుమారుడు అరుణకుమార్‌కు తెలిపి మృతదేహాన్ని అప్పగించారు.

### గడ్డివాము దగ్ధం

ఆగిరిపల్లి, జూన్ 2: పిడుగుపాటుకు గడ్డివాము దగ్ధమైన ఘటన కొమ్మూరులో చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం ఉరుములు, పిడుగులతో వర్షం రాగా, ఆగిరిపల్లి మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన గంటా శరత్‌బాబు ఇంటివద్ద గల గడ్డివాముపై పిడుగు పడటంతో గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో 10 ఎకరాల గడ్డివాము పూర్తిగా దగ్ధమైందని, లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు.

### లైంగిక దాడి కేసుపై డీఎస్పీ విచారణ



ముసునూరు, జూన్ 2: మండలంలోని ఒక గ్రామంలో లైంగిక దాడి కేసుపై నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య ఆదివారం విచారణ నిర్వహించారు. కొండపల్లి చెన్నారావు అనే నిందితుడు అత్యాచారం చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై డీఎస్పీ సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు, నిందితుడి మధ్య గతంలో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? తదితర అంశాలపై చుట్టు పక్కలవారిని విచారించి, వివరాలు సేకరించారు. లైంగిక దాడికి పాల్పడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సమగ్ర నివేదికను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతికి నివేదిస్తామని తెలిపారు. ఈ విచారణలో ఎస్‌ఐ పి.వాసు, వీఆర్వో సుబ్బారావు, మహిళా పోలీస్ కరుణ, స్టేషన్ రైటర్ భాగ్యాలరావు తదితరులు పాల్గొన్నారు.





బాలుర వసతి గృహంలో పెచ్చులూడుతున్న పైకప్పు.. తలుపులు లేని మరుగుదొడ్లు

పెచ్చులు ఊడిన స్లాబు..

## తలుపుల్లేని మరుగుదొడ్లు!

**వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వాలు ఆ దిశగా విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో విఫలమౌతున్నాయి. కొద్దిరోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి.**

(ముసునూరు)

▸సాంఘిక సంక్షేమ వసతి గృహాల తీరిది
▸విద్యార్థులకు సమస్యల స్వాగతం
▸ఉన్నతాధికారులు స్పందించాలని వినతి

ముసునూరులోని సాంఘిక సంక్షేమ బాలికలు, బాలుర వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వసతి గృహాలు శిథిలావస్థకు చేరి స్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపోయి ఐరన్ బయట పడింది. కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో ఆరుబయటే విద్యార్థులు స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యలను వేసవిలోనైనా పరిష్కరించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఏడాది కూడా బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది.

### శిథిలావస్థలో భవనాలు..

ముసునూరులో బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని 34 ఏళ్ళ కిందట నిర్మించారు. దీనిలో 90 మంది విద్యార్థులు ఉండి చదువుకుంటున్నారు. అలాగే బాలికల వసతి గృహంలో 140 మంది ఉన్నారు. అయితే ఈ రెండు భవనాలు శిథిలావస్థకు చేరాయి. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడి, కొద్దిపాటి వర్షానికే గదుల్లోకి నీరు చేరుతోంది. అక్కడక్కడ గోడలు బీటలు వారాయి. మరుగుదొడ్లకు తలుపు లేక విద్యార్థుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. కిటికీల తలుపులు దెబ్బతినగా, మంచాలు లేక విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. ఏ సమయంలో విషపురుగులు గదుల్లోకి వస్తాయోనని విద్యార్థులు భయభ్రాంతులకు గురైవుతున్నారు. ఇక వంట గది పరిస్థితి మరి అధ్వానం. ఫ్లోరింగ్ దెబ్బతింది. గత ఐదేళ్ళలో వసతి గృహాలకు ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైన సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి వసతి గృహాల్లో కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ఐదేళ్లుగా ప్రతిపాదనలు...

ముసునూరు బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవం. మరమ్మతులకు నిధుల కోసం ఐదేళ్ళుగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. మౌలిక వసతుల కల్పనకు నిధుల కోసం కూడా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా నేటి వరకు ఒక్క రూపాయి మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే బీసీ హాస్టల్ భవనానికి మరమ్మతులు చేయిస్తాం.

-ఆర్.రవిప్రసాద్, ఏబీసీడబ్ల్యూవో, నూజివీడు.

## కౌంటింగ్‌కు సహకరించాలి



**కైకలూరు నియోజకవర్గానికి 14 టేబుళ్లు, 17 రౌండ్లుగా ఓట్ల లెక్కింపు**
**రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్**

కైకలూరు, జూన్ 2: ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కైకలూరు రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కైకలూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కి ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ బూత్‌లకు గాను 2,05,604 మంది ఓటర్లకు గాను గత నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో 1,79,536 ఓట్లు పోలయ్యాయన్నారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. కైకలూరు నియోజకవర్గానికి 14 టేబుళ్లు, 17 రౌండ్లు చొప్పున లెక్కింపు నిర్వహిస్తామన్నారు. ముందుగా సర్వీసు ఓట్లు 34, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1607 లెక్కింపు అనంతరం ఈవీఎంల లెక్కింపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఎంపీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కూడా 14 టేబుళ్లు, 17 రౌండ్లు చొప్పున నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, ఏజెంట్లు మినహా ఇతరులు రావడానికి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దే కాకుండా నియోజకవర్గం మొత్తం 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్‌కు వచ్చే వారు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు తీసుకురావద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని అనుమతించమన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే ప్రతి ఏజెంట్‌ను మద్యం సేవించినదీ లేనిదీ పరీక్ష చేస్తామన్నారు. ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లిన తరువాత పూర్తయ్యే వరకు బయటకు రావడానికి వీలులేదని, ఏవైనా అనారోగ్య సమస్యలుంటే ముందుగానే వాటికి సంబంధించిన మందులను తీసుకువెళ్లాలని సూచించారు. కౌంటింగ్ అనంతరం కూడా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని ఎవరైనా గొడవలకు దిగితే పోలీసులు కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.



**నూజివీడు నియోజకవర్గానికి 14 టేబుళ్లు, 21 రౌండ్లుగా ఓట్ల లెక్కింపు**
**రిటర్నింగ్ అధికారి వై. భవాని శంకరి**

### అవాంఛనీయ ఘటనలకు తావివ్వద్దు

**నూజివీడు:** కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసే వరకు కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు సహకరించాలని నూజివీడు ఆర్వో వై.భవాని శంకరి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో కౌంటింగ్ ఏజెంట్లు, వివిధ రాజకీయపక్షాల నాయకులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మంగళవారం కౌంటింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏజెంట్లు, అభ్యర్థులు అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో నూజివీడు నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వీటికి అదనంగా మరో రెండు పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్ ఏర్పాటు చేశామని, మొత్తం 21 రౌండ్‌లలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించటం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నూజివీడు మండలం, నూజివీడు మున్సిపాల్టీ, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల పరిధిలో మొత్తం 286 పోలింగ్ స్టేషన్‌లకు గాను 2,38,981 మంది ఓటర్లు ఉండగా, 87.94 శాతం ఓటింగ్ నమోదు అయిందన్నారు. 2,10,161 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.



కైకలూరు ఎస్టీ కాలనీలో అనుమానితులను ప్రశ్నిస్తున్న సీఐ రఘు




ముదినేపల్లిలో విజిబుల్ పోలీసింగ్

## అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కేసులు

▸ కైకలూరు టౌన్ సీఐ రఘు
▸ భుజబలపట్నంలో పికెట్ ఏర్పాటు
▸ విజిబుల్ పోలీసింగ్‌తో పాటు కార్డన్‌సెర్చ్

కైకలూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఈ నెల 4న నిర్వహిస్తున్నందున గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కేసులు నమోదవుతాయని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు హెచ్చరించారు. ఆదివారం కైకలూరు ఎస్టీ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఆరా తీస్తున్నామని, ఏ విధమైన రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కైకలూరు రూరల్ పోలీసులు మండలంలోని సమస్యాత్మకమైన భుజబలపట్నం గ్రామంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం భుజబలపట్నంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ముందస్తుగా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

### గ్రామాల్లో కవాతు

**ముదినేపల్లి:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు పోలీసు శాఖ ముదినేపల్లి మండలంలో రంగంలోకి దిగింది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ రావటం, ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు టెన్షన్‌లో ఉండటం, మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుండటంతో గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముదినేపల్లి ఎస్‌ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విజి బుల్ పోలీసింగ్ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ముదినేపల్లి, వడాలి, సింగరాయపాలెం, బొమ్మినంపాడు, పెదపాలపర్రు, గురజ, చిగురుకోట గ్రామాల ఏరియాల్లో పోలీస్ పహరా నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

## తప్పుకుంటే కాల్వలోకే!

### రైలింగ్ ఊడిపోయి ప్రమాదకరంగా సంతోషపురం వంతెన



రైలింగ్ పూర్తిగా ఊడి ప్రమాదకరంగా వంతెన

కలిదిండి, జూన్ 2 : మండలంలో సంతోషపురం ప్రధాన కాల్వపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. 35 ఏళ్ల క్రితం ఈ వంతెన నిర్మించారు. ఇంత వరకు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. వంతెన ఇరువైపులా రైలింగ్ పూర్తిగా విరిగిపోయింది. దీంతో వాహనాలు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడటంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పుకోవటానికి వీలు లేక గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ వంతెన పక్కనే దుర్గమ్మ ఆలయం ఉండటంతో రద్దీగా ఉంటుంది. భక్తులు ఈ వంతెన పైనుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లి వస్తుంటారు. ఏ క్షణంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. వంతెన స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. వంతెన ఇరువైపులా ఉన్న గోడలు బీటలు వారాయి. రూ.7 కోట్లతో నూతనంగా నిర్మించిన పాతాళ భోగేశ్వరస్వామి బీటీ రోడ్డు ఈ వంతెనపై నుంచి వెళ్లటంతో వాహనాల రాక పోకలతో రద్దీగా ఉంటుంది. భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు వంతెన ఊగిపోతోందని ఏ క్షణంలో కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేపట్టాలని పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న సంతోషపురం వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## అల్లుకున్న నిర్లక్ష్యం



ట్రాన్స్‌ఫార్మర్‌పైకి అల్లుకున్న పిచ్చి పాదు

నూజివీడు పట్టణం తిరువూరు రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఇలా పాదులు అల్లుకోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఎమ్‌అండ్‌కె ప్రధాన రహదారిపైన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై పాదులు అల్లుకోవడం వల్ల అటుగా వెళ్ళే చిన్నారులు పశుపక్ష్యాదులు ఏమాత్రం వాటిని ముట్టుకున్నా ప్రమాదం. అను క్షణం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎటువంటి పాదులు లేకుండా చూడాల్సిన విద్యుత్ శాఖ నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రమాదం పొంచి ఉందని, తక్షణం జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-నూజివీడు టౌన్



సుధాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

## సీఆర్పీఎఫ్ జవాన్ సుధాకర్‌కు ఘన నివాళి

నూజివీడు టౌన్, జూన్ 2: సీఆర్‌పీఎఫ్ జవాన్ సుధాకర్‌కు అధికారులు ఘన నివాళి అర్పించారు. 79వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన నూజివీడుకు చెందిన సుధాకర్ మణిపూర్‌లో ఉగ్రవాదులతో జరిగిన దాడుల్లో 1995 జూన్ 2న వీరమరణం పొందాడు. ఈ నేపథ్యంలో సుధాకర్ కుటుంబీ కులను కలిసిన సీఆర్‌పీఎఫ్ అధికారులు సుధాకర్ సతీమణి జయమ్మను సత్కరించి సుధాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నూజివీడు తహసీల్దార్ ఏవీ శాస్త్రి, టౌన్ సీఐ మూర్తి, సీఆర్‌పీఎఫ్ నోడల్ ఆఫీసర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి



కలిదిండి, జూన్ 2 : పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి పెంపొందుతుందని గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు అన్నారు. ఆదివారం కలిదిండి గ్రంథా లయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

### గీతాలాపనపై విద్యార్థులకు శిక్షణ



ముదినేపల్లి, జూన్ 2 : వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పాటలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయా ధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో రిటైర్డ్ జిల్లా గ్రంథాలయాధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు పాటలు పాడటంలో నైపుణ్యం పెంచుకోవటం, గానం మెరుగుపర్చుకునే విధానాలను వివరించారు. అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్రను వివరించి ఆయన పాడిన పాటలను వినిపించారు. అనంతరం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు.

### మూల్లంకలో శానిటేషన్ డ్రైవ్

కలిదిండి, జూన్ 2 : మూల్లంకలో ఆదివారం సర్పంచ్ మహదేవ్ విజయ్ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు నిర్వహించారు. రహదారులపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. డ్రెయినేజీల్లో పూడిక తీయించారు. అంతర్గత రహదారులపై నీరు నిల్వ లేకుండా గాడి తీశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా భక్తాంజనేయ స్వామి రథోత్సవం



ముదినేపల్లి, జూన్ 2 : హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా ముదినేపల్లిలో సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామి రథోత్సవం ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో రథోత్సవంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అర్చకుడు శ్రీనివాసుల ఫణి కుమార్ హోమాలు నిర్వహించారు.